AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
12-3-2026 (Thursday) MAIN EDITION

## కవిత ఇంటికి సీబీఐ అధికారులు




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇంటికి గురువారం సీబీఐ అధికారులు వచ్చారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో హైకోర్టు నోటీసులు ఇవ్వడానికి ఆమె ఇంటికి అధికారులు చేరుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసును ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఆధారాలు లేవని చెప్పి ఈ కేసులో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కల్వకుంట్ల కవిత సహా 23 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పుపై సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు తమ వాదనలు పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం నిందితులకు నోటీసులు ఇచ్చింది. దీంతో వాటిని అందజేసేందుకు అధికారులు కవిత ఇంటికి వచ్చారు.

## హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్లే : రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. నగరానికి నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే అన్నారు. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు ఫ్యూచర్ సిటీలో అవసరమైన స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను నిర్వహించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోను ముఖ్యమంత్రి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు.

## యుద్ధం ఆపేస్తాం.. ఇరాన్ అధ్యక్షుడు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ సంచలన ప్రకటన చేశారు. తాము యుద్ధం ముగించేందుకు సిద్ధమని తెలిపారు. ఇరాన్ హక్కులను అంగీకరించాలని, భవిష్యత్ దురాక్రమణకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక అంతర్జాతీయ హామీ ఇవ్వాలని, దాడులతో జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పంచాయతీలను బలోపేతం చేస్తాం



**అక్షరటుడే, ఖమ్మం:** గ్రామ పంచాయతీల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామాలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

## సిలిండర్ బుకింగ్ గడువు పెంపు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డొమెస్టిక్ వంట గ్యాస్ సిలిండర్ బుకింగ్ గడువును 45 రోజులకు పొడిగించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో గ్యాస్ సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో దానిని 45 రోజులకు పొడిగించింది. పట్టణ ప్రాంతాల్లో మాత్రం 25 రోజులే ఉండనుంది.



## రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి

**అక్షరటుడే, హైదరాబాద్:** రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు వెంటనే అందించాలన్నారు. తమ సమస్యలపై పలువురు విశ్రాంత ఉద్యోగులు గురువారం హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా సేవలందించిన వారి విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదన్నారు. రిటైర్డ్ అయ్యాక బెన్ఫిట్స్ ఇవ్వకుండా కర్కశంగా వ్యవహరిస్తుండడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వ తీరుతో బెన్ఫిట్స్, పెన్షన్ బకాయిలు రాక మనోవేదనకు గురై ఎంతో మంది ప్రాణాలు కోల్పోగా, వందల సంఖ్యలో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## బాలికపై లైంగిక వేధింపులు.. నిందితుడికి ఐదేళ్ల శిక్ష

**అక్షరటుడే, హైదరాబాద్:** బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. హాకా భవన్‌లోని పోక్సో చట్టం కేసుల ప్రత్యేక సెషన్స్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు ఈ మేరకు తీర్పు వెల్లడించారు. చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని జి.ఎం. కాలనీకి చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ (23) ఓ బాలికకు అరబిక్ ట్యూషన్ చెప్పేవాడు. 2019లో ఒకరోజు ట్యూషన్ సమయంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, సెల్ ఫోన్ ఆశ చూపి బాలికపై లైంగిక దాడి చేయడానికి యత్నించాడు. దీంతో బాలిక గట్టిగా అరవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు.

భారత కరెన్సీ రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ గురువారం ఇంట్రాడేలో 92.36కు పడిపోయి మరోసారి ఆల్‌టైం కనిష్టాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత కరెన్సీ రూపాయి విలువ రోజురోజుకు పడిపోతోంది. –అక్షరటుడే, బిజినెస్‌డెస్క్



# ఆల్‌టైం కనిష్టానికి రూపాయి..

- డాలర్‌తో రూ. 92.36కు పడిపోయిన విలువ
- రోజురోజుకూ క్షీణిస్తున్న వైనం
- అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలతో క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలు రావడం, ఎఫ్‌ఐఐలు నిరంతరాయంగా పెట్టుబడులను ఉపసంహరిస్తుండడం వంటి కారణాలతో మన రూపాయి తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. గురువారం ఇంట్రాడేలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 92.36కు పడిపోయి మరోసారి జీవన కాల కనిష్టాన్ని నమోదు చేసింది. మన కరెన్సీ రోజురోజుకూ బలహీనమవుతుండడం ఆర్థిక వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది.

### ఎఫ్‌ఐఐల అమ్మకాల ప్రభావం..

విదేశీ సంస్థాగత మదుపరులు మన మార్కెట్ నుంచి అలుపన్నదే లేకుండా పెట్టుబడులను ఉపసంహరిస్తూనే ఉన్నారు. గతేడాది జూలైనుంచి వారు భారత ఈక్విటీ మార్కెట్లలో నెట్ సెల్లర్లుగానే ఉంటున్నారు. జూన్‌లో నికరంగా రూ. 7,488.98 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేసిన ఎఫ్‌ఐఐలు.. ఆ తర్వాత నెలనుంచి నికర అమ్మకందారులుగానే ఉంటున్నారు. జూలైలో రూ. 47,666 కోట్లు, ఆగస్టులో రూ. 46,902 కోట్లు, సెప్టెంబర్‌లో రూ. 35,301 కోట్లు, అక్టోబర్‌లో రూ. 2,346 కోట్లు, నవంబర్‌లో 17,500 కోట్లు, డిసెంబర్‌లో 34,349 కోట్లు, ఈ ఏడాది జనవరిలో రూ. 41,435 కోట్లు, ఫిబ్రవరిలో 6,640 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈనెలలో ఇప్పటికే నికరంగా రూ. 39,116 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించడం గమనార్హం. విదేశీ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండడంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయి విలువ పడిపోతోంది.

### క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో..

క్రూడ్ ఆయిల్ ధర పెరుగుదల ప్రభావం కూడా రూపాయిపై పడుతోంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఈ ఏడాది ప్రారంభంలో బ్యారెల్‌కు 60 డాలర్ల వద్ద ఉంది. గురువారం వంద డాలర్లకు సమీపంలో ట్రేడ్ అవుతోంది. రెండున్నర నెలల్లోనే సుమారు 60 శాతం ధర పెరగడం గమనార్హం. భారత్ ఎక్కువగా ముడి చమురు దిగుమతిపై ఆధారపడిన దేశం కావడంతో ధరల పెరుగుదల ప్రభావంతో రూపాయి విలువ క్షీణిస్తోంది.

### ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు సైతం రూపాయిని బలహీనపరుస్తున్నాయి. అగ్రరాజ్యాధినేత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అన్ని దేశాలపై సుంకాలు వడ్డిస్తుండడంతో ఈక్విటీ మార్కెట్ ఒత్తిడికి గురవుతోంది. రెసిప్రోకల్ టారిఫ్స్ చెల్లవని యూఎస్ కోర్టు తీర్పు ఇచ్చినా ట్రంప్ వైఖరిలో మార్పు రావడం లేదు. అదనపు సుంకాలను విధించేందుకు కొత్తదారులు వెతుకుతుండడంతో ఇన్వెస్టర్లు బంగారం, వెండి వంటి లోహాల వైపు దృష్టి సారించడంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి బలహీనపడింది.

## కేటీఆర్‌ను కలిసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు



**అక్షరటుడే, హైదరాబాద్:** తమకు పని, వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించిన విషయం తెలిసిందే. సర్వేయర్ల కొరత అరికట్టడానికి పెద్ద మొత్తంలో వీరిని నియమించింది. భూ భారతి పోర్టల్ కోసం లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. వీరికి శిక్షణ సైతం పూర్తయింది. అయితే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు వేతనాలు ఉండవని, సర్వే చేసిన ఎకరాల ఆధారంగా కమీషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఈ క్రమంలో వారు ఆందోళన చెందుతున్నారు. తమకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## క్యాప్ జెమినీ సీఈవోతో ఏపీ మంత్రి లోకేష్ భేటీ



**అక్షరటుడే, ఏపీ:** క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఇజ్జత్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో డెవలప్‌మెంట్ సెంటర్, జీసీసీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా విశాఖను ఐటీ హబ్‌గా మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు డేటా సెంటర్లు, సంస్థల ఏర్పాటు కోసం ఆయా పలు కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు సమావేశం అవుతున్నారు. ఇందులో భాగంగా తాజాగా లోకేష్ క్యాప్ జెమినీ సీఈవోతో చర్చించారు. అన్ని అనుకూలతలు ఉన్న వైజాగ్‌లో 20వేల ఉద్యోగాలు కల్పించే సామర్థ్యం గల ఐటీ డెవలప్‌సెంటర్, జీసీసీ, క్లౌడ్ సర్వీసెస్, బీపీఎం వర్టికల్స్ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు.

## గ్యాస్ కొరతతో అయోధ్యలో నిలిచిన ప్రసాదం పంపిణీ




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** గ్యాస్ కొరత ఎఫెక్ట్ దేశంలోని ప్రముఖ ఆలయాలపై సైతం పడింది. నిత్యం వేలమంది భక్తులు దర్శనం చేసుకునే అయోధ్యలో ప్రసాదం పంపిణీని నిర్వాహకులు నిలిపివేశారు. అయోధ్య బాలరాముడిని నిత్య అనేక మంది భక్తులు దర్శించుకుంటారు. స్వామి వారి ప్రసాఆదం రామ్ రసోయి ఎంతో భక్తితో ఆరగిస్తారు. నిత్యం 20 వేల మందికి అక్కడ భోజనం పెడతారు. అయితే గ్యాస్ కొరత కారణంగా రామ్ రసోయి నిలిచిపోయినట్లు ఆలయ నిర్వాహకులు బోర్డు పెట్టారు. ప్రసాదం పంపిణీని పూర్తిగా మూసి వేయలేదన్నారు. ఉదయం పూట ప్రసాద వితరణ కొనసాగుతుందని, సాయంత్రం పూట మాత్రం మూసివేస్తామని ప్రకటించారు.

## బలగం బ్యూటీ పెళ్లి పీటలు ఎక్కనుందా..?



టాలీవుడ్‌లో ప్రస్తుతం సెలబ్రిటీల పెళ్లి వార్తలు తరచూ వినిపిస్తున్న క్రమంలో మరో యువ నటి గురించి వస్తున్న వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. 'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన నటి కావ్య కళ్యాణ్ రామ్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతుందనే ప్రచారం ఫిల్మ్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. ఈ అమ్మడు ఒక యువ సంగీత దర్శకుడితో సన్నిహితంగా ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. కొంతకాలంగా ఇద్దరూ ఒకరికొకరు ఇష్టపడుతుండగా, ఇప్పుడు తమ బంధాన్ని పెళ్లి రూపంలో ముందుకు తీసుకెళ్లాలని ఆలోచిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు.

– అక్షరటుడే, సినిమాడెస్క్

## గ్యాస్ కొరతపై ప్రతిపక్షాల ఆందోళన




**అక్షరటుడే, ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో గ్యాస్ సంక్షోభం తలెత్తింది. ఇప్పటికే వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిచిపోగా.. డొమెస్టిక్ గ్యాస్ కొరత సైతం నెలకొంటుంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గ్యాస్ కొరతపై పార్లమెంట్ ముందు ప్రతిపక్షాలు గురువారం ఆందోళన నిర్వహించాయి. గ్యాస్ సంక్షోభానికి నిరసనగా ప్లకార్డులు పట్టుకుని ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆయా పార్టీల ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎల్‌పీజీ కొరతతో ప్రజలు బారులు తీరుతున్నారని చెప్పారు. అనేక హోటళ్లు మూత పడ్డాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి దీనిని జరగకుండా నిరోధించడంలో పూర్తిగా నిస్సహాయంగా ఉన్నారని విమర్శించారు.

## అమెరికా ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాక్ సమీపంలో అమెరికాకు చెందిన చమురు ట్యాంకర్‌పై ఇరానియన్ ఆత్మాహుతి పడవ దాడి చేసింది. ఈ ఘటనలో ఒక భారతీయుడు మరణించినట్లు సమాచారం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో రెండు నౌకలపై ఇరాన్ దాడి చేసింది. అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్ నౌకలపై దాడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉందని తెలుస్తోంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తున్న సమయంలో సూసైడ్ బోటు ఢీకొంది. దీంతో పెద్ద ఎత్తున పేలుడు చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో రెండు పడవల్లో 38 మంది సిబ్బంది ఉండగా.. ఒక భారతీయుడు చనిపోయాడు.